
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట
5
శనివారం 24 మే 2025



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'ప్రజాపాలన ప్రగతిబాట' సభతో జహీరాబాద్ పట్టణం జనసంద్రమైంది. మధ్యాహ్నం హెలికాప్టర్ ద్వారా జహీరాబాద్‌కు చేరుకున్న సీఎం ముందుగా ఝరాసంగంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించి, విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం జహీరాబాద్‌కు చేరుకుని ప్రారంభోత్సవాలు చేసి, సభా స్థలం వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. అనంతరం వేదికపైకి చేరుకోగానే సభాప్రాంగణం హోరెత్తింది. ఎటుచూసిన జనంతో నిండిపోయింది. మహిళలు, పెద్దలు, యువత చేతులు ఊపుతూ తమ ఉత్సాహాన్ని తెలిపారు. పలువురు తమ సెల్‌ఫోన్‌లలో ముఖ్యమంత్రిని చిత్రీకరించడం కనిపించింది.




సీఎం రేవంత్, మంత్రులు దామోదర్, సురేఖతో కలిసి మహిళా సంఘాల స్టాల్స్ తిలకిస్తున్న నిర్మలాజగ్గారెడ్డి, మహిళల పెట్రోల్‌బంకు ప్రారంభంలో సీఎం, మంత్రితో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సీఎం పర్యటనలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి, ఆంధ్రజ్యోతి, మే 23 : జహీరాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఆద్యంతం టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. సీఎం హెలీప్యాడ్ వద్ద దిగినప్పటి నుంచి తిరిగివెళ్లేదాకా ఆయన వెంటే ఉన్నారు. సీఎంతోపాటు మంత్రులు కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహాతో కలిసి కార్యక్రమాలకు ఆమె హాజరయ్యారు.

సామాజిక సమానత్వానికి కాంగ్రెస్ కృషి

▸▸ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



జహీరాబాద్, మే 23(ఆంధ్రజ్యోతి) : సామాజిక సమానత్వం కోసం కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. నిరుపేదలకు అండగా నిలిచిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకే ఉందని గుర్తుచేశారు. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ స్ఫూర్తితో పనిచేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసినా సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తుచేశారు. అన్ని వర్గాల వారి అభివృద్ధి కోసం కులగణన, వర్గీకరణను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తున్నామన్నారు. జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్ ప్రాంతాల అభివృద్ధికి సీఎం ప్రత్యేక నిధులను ఇచ్చి ఆదుకోవాలని కోరారు. జహీరాబాద్‌లో చక్కెర పరిశ్రమను పునరుద్ధరించాలని, మెదక్-బీదర్, నాందేడ్-లాతూర్ రహదారుల అభివృద్ధికి కృషి చేయాలని, సింగూరును పర్యాటక కేంద్రంగా మార్చాలని ఆయన ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

మహిళలను కోటీశ్వరులు చేసేందుకు కృషి

▸▸ దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ



మహిళల్ని కోటీశ్వరులు చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి కొండా సురేఖ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తుందన్నారు. అందులో భాగంగా పెట్రోల్‌బంకులు, విద్యుదుత్పత్తి కేంద్రాలు, సమష్టి వ్యాపారాల నిర్వహణకు సహకరిస్తున్నదని తెలిపారు. కష్టపడే మనస్తత్వం ఉన్నవారిని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. ఈ ఆర్థిక సహాయంతో మహిళలు కోటీశ్వరులు అయ్యేందుకు సంకల్ప బలంతో పనిచేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు అందరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

అందరం ప్రజాసేవలోనే తపిస్తున్నాం

▸▸ జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు



ప్రజాప్రతినిధులందరూ ప్రజాసేవలోనే తపిస్తున్నారని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా తయారై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం హయాంలో మంజూరు చేసిన వాటిని రద్దు చేయడం మూలంగా పనులన్నీ ఆగిపోయాయన్నారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి పెద్దమొత్తంలో నిధులను కేటాయించాలని ముఖ్యమంత్రికి వేడుకుని వినతిపత్రం అందజేశారు.

గుండెల్లో పెట్టుకుంటాం

- కాంగ్రెస్ హయాంలోనే నిమ్జ్‌కు శ్రీకారం
- పదేళ్ల పాటు పట్టించుకోని గత ప్రభుత్వాలు
- చెరుకు రైతుల సహకార సంఘానికి వంద ఎకరాలు కేటాయిస్తా
- నిమ్జ్ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తాం
- జహీరాబాద్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ



వేదికపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర్, కొండా సురేఖ తదితరులు



సంగారెడ్డి ప్రతినిధి, ఆంధ్రజ్యోతి, మే 23 : మెదక్ నుంచే ఇందిరాగాంధీ ఎంపీగా గెలిచి ప్రధానమంత్రి అయ్యారని, ఈ జిల్లా అంటేనే ఇందిరమ్మ గుర్తుకొస్తారని ఇక్కడి ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం గుండెల్లో పెట్టుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జహీరాబాద్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన ప్రగతిబాట సభా వేదికపై నుంచి ప్రసంగించారు. జహీరాబాద్, పటాన్‌చెరు, నారాయణఖేడ్ ప్రాంతాల అభివృద్ధికి ఈ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో కాంగ్రెస్ హయాంలోనే నిమ్జ్‌కు శ్రీకారం చుట్టారన్నారు. నిమ్జ్ నిర్వాసితులైన 5,612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ఈ పట్టాలు అందజేసే బాధ్యత జగ్గారెడ్డి తీసుకోవాలని కోరారు. నిమ్జ్‌తో జహీరాబాద్ ప్రాంతం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇక్కడి పారిశ్రామిక కారిడార్‌లో హ్యుందాయ్ కార్ల పరిశ్రమ రానుందని ప్రకటించారు. 2014 తర్వాత గడిచిన పదేళ్లలో నిమ్జ్‌ను పట్టించుకోకపోవడం వల్ల కుంటుపడిందని ఆరోపించారు. ఈ ప్రాంతంలోని చెరకు రైతుల సహకార సంఘానికి వంద ఎకరాలను కేటాయిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. చెరకు పండించే రైతులంతా ఒక సహకార సంఘాన్ని ఏర్పాటు చేసుకోవాలని, దీని ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో చక్కెర పరిశ్రమను మిగతా 7వ పేజీలో

జహీరాబాద్ అభివృద్ధికి చొరవ చూపాలి


▸▸ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్



జహీరాబాద్, మే 23(ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ కోరారు. జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాలు అభివృద్ధిలో వెనుకబడి ఉన్నందున ఆయా ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులను కేటాయించి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ హయాంలో, మాజీ మంత్రి గీతారెడ్డి నేతృత్వంలో జహీరాబాద్ ప్రాంతానికి 12,500 ఎకరాల్లో నిమ్జ్ ప్రాజెక్టు ఏర్పాటుకు రూపకల్పన చేశారని ఆయన గుర్తుచేశారు. నిమ్జ్ అభివృద్ధి చేసి పరిశ్రమలను తీసుకురావాలని కోరారు. అన్ని రంగాలను అభివృద్ధి చేస్తే హైదరాబాద్ తర్వాత జహీరాబాదేనని చెప్పారు. ఈ ప్రాంతంలో రైతులు ఎక్కువగా వాణిజ్య పంటలను పండిస్తూ వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తారన్నారు. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను అభివృద్ధి చేసి జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాలను సస్యశ్యామలంగా మారేలా చూడాలని కోరారు. జహీరాబాద్ ప్రాంతంలో చక్కెర పరిశ్రమ అత్యవసరమున్నందున 100 ఎకరాలను కేటాయించి పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు.



జనసంద్రమైన సభా ప్రాంగణం



అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



అసంపూర్తి పనులతో ఉన్న డ్రైనేజీని పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నేషనల్ హైవే పనుల్లో జాప్యం వల్లే ఇబ్బందులు

- డ్రైనేజీ పూర్తికాకపోవడంతో ఇళ్లలోకి వరద
- పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కాంట్రాక్టర్‌పై చర్యలు
- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే పనుల్లో జాప్యం వల్ల వర్షం వచ్చినపుడు హుస్నాబాద్ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా డ్రైనేజీ కనెక్టివిటీ పనులు పెండింగ్‌లో ఉండడంతో వర్షాలు కురిసినపుడు ఇళ్లలోకి వరద నీరు వస్తుందన్నారు. హుస్నాబాద్‌లో గురువారం రాత్రి కురిసిన వర్షానికి కొన్ని ఇళ్లలోకి, దుకాణాల్లోకి వరద నీరు చేరడంతో ఆయా ప్రాంతాలను శుక్రవారం ఉదయం ఆయన పరిశీలించారు. ద్విచక్రవాహనంపై తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మల్లెచెట్టు చౌరస్తా, అనభేరి చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తాలో ఉన్న నాలాలు, కల్వర్టులను పరిశీలించారు. డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. లేదంటే కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆర్డీవో రామ్మూర్తి, కమిషనర్ మల్లికార్జున్, నాయకులు చిత్తారి రవీందర్, చిత్తారి పద్మ, అక్కు శ్రీనివాస్ తదితరులున్నారు.

కొత్త సహకారం ఏదీ?

- ఆరునెలల క్రితమే 16 కొత్త సొసైటీలకు ప్రతిపాదనలు
- వాటితోనే సరిపెడుతున్న వైనం



దుబ్బాక వ్యవసాయ సహకార సంఘ భవనం

దుబ్బాక, మే 23 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అన్నిరకాలుగా సహకారం అందించడమే లక్ష్యంగా ఏర్పడిన వ్యవసాయ ప్రాథమిక సంఘాలు 'కొత్త రూపు' దిద్దుకోవడం లేదు. కేంద్రం కొత్త మార్గదర్శకాలతో ఆదాయ వనరులు, వ్యవసాయ సహకారం విస్తృతం చేసేందుకు సొసైటీల విస్తీర్ణానికి ప్రతిపాదనలు కోరింది. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన 9 మండలాలతో పాటు, ఏడింటిని అదనంగా సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం జిల్లాలో 87,197 మంది సభ్యులున్నారు. 5వేలకు ఒక్క సొసైటీని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నప్పటికీ, నిర్వహణ భారం కావడంతో ప్రస్తుతం 16 సొసైటీలను ప్రతిపాదించారు.

నష్టాల బాటలోనే

సుమారు 19 సొసైటీలు నష్టాల్లోనే ఉన్నాయి. పెద్దరైతులకు అందించే ఎల్‌టీ రుణాలు, రికవరీలు లేక నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఆదాయ వనరులను పెంచుకోవడానికి వివిధ రకా ల ప్రయత్నాలు చేస్తున్నారు. పాత కరీంనగర్, వరంగల్ జిల్లాకు కోహెడ, బెజ్జంకి, హుస్నాబాద్‌లు సొసైటీలు ఆదాయ వనరులను పెంచుకున్నాయి. కోహెడలో పెట్రోల్‌బంక్ ద్వారా వ్యాపారం సాగిస్తున్నారు. ధాన్యం సేకరణలో హుస్నాబాద్, సిద్దిపేట సొసైటీలు ముందున్నాయి. చిన్నకోడూరు మండలం అలీపూర్, సిద్దిపేటరూరల్ మిట్టపల్లి సొసైటీలు తక్కువ ధాన్యం సేకరిస్తున్నాయి. సిద్దిపేట, దుబ్బాక, రామాంచ, కాన్‌గల్, అల్లీపూర్ సొసైటీలు రికవరీలు సక్రమంగా లేకపోవడంతో నష్టాల్లో సాగుతున్నాయి. వీటితోపాటు జిల్లాలోని చాలా సొసైటీలు నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో నూతన సొసైటీల ఏర్పాటు భారమా..? లాభమా..? అనేది చూడాల్సి ఉంది.

భారంతో కుదింపు

జిల్లాలో 2005 వరకు సిద్దిపేట డివిజన్‌లోనే 64 సొసైటీలు ఉండేవి. చిన్నగుండవెళ్లి, రాఘవాపూర్, ఇరుకోడు, నారాయణరావుపేట, పొన్నాల సొసైటీలను సిద్దిపేట సొసైటీలో విలీనం చేశారు. చిట్టాపూర్, ధర్మాజీపేట, ఆకారం, తిమ్మాపూర్ సొసైటీలు దుబ్బాక సొసైటీలో విలీనం చేశారు. భూంపల్లి, చెప్యాలను మిరుదొడ్డి సొసైటీలో విలీనం చేశారు. సిద్దిపేట, గజ్వేల్ డివిజన్‌లో సుమారు 48 సొసైటీలను 21 సొసైటీల్లో విలీనం చేశారు. ప్రస్తుతం కరీంనగర్ నుంచి 4, వరంగల్ నుంచి 2 సొసైటీలు సిద్దిపేట జిల్లాలో కలిశాయి. ఇవికేవలం అప్పటి పరిస్థితిలో ఆయా ప్రభుత్వాలు సహకార సంఘాలు ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో పాటు నిర్వహణ భారాన్ని తొలగించుకోవడానికి విలీనం చేశాయి. అంజుమాన్ బ్యాంకుగా పేరున్న సహకార బ్యాంకులు రుణాలు ఇవ్వడం తప్పితే, మొండిబకాయిలతో

మిగతా 8లో..



బెజ్జంకిలో పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంకు

ప్రతిపాదిత కొత్తసొసైటీలు ఇవే

అక్బర్‌పేట-భూంపల్లి, చిన్నకోడూరు మండలం చిన్నకోడూర్, ఇబ్రహీంనగర్ నారాయణరావుపేట మండలం నారాయణరావుపేట, గుర్రాలగొంది, రాయపోల్, మర్కూక్, దూల్మిట్ట, అక్కన్నపేట, కుకునూరుపల్లి, సిద్దిపేట రూరల్, కొమురవెల్లి, హుస్నాబాద్ మండలం రామవరం, నంగునూర్ మండలం నర్మెట, గజ్వేల్ మండలం పిడిచెడ్, బెజ్జంకి మండలం బేగంపేట సొసైటీగా ఏర్పాటుకు జనవరి మొదటివారం లో ప్రభుత్వానికి పంపారు. వీటి ఏర్పాటుపై ప్రభుత్వం ఇప్పటివరకు నిర్ణయం తీసుకోకపోవడం, ప్రస్తుతం కొనుగోలు సీజన్ కావడంతో అవస్థలు తప్పడం లేదు. సొసైటీలు లేకపోవడంతో కొత్త మండలాలకు రావాల్సిన విత్తనాలు, ఎరువులు కూడా రైతులకు అందుబాటులో ఉండడం లేదు. పక్కమండలాలకు వెళ్లితీసుకోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొత్తసొసైటీలను త్వరితగతంగా ఏర్పాటు చేయడంతోపాటు 2005 కంటే ముందు ఉన్న సొసైటీలను పునరుద్ధరిస్తే, మరిన్ని సేవలు విస్తరణకు అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు.

భర్తను వదిలించుకోవడానికే పసిబిడ్డ ప్రాణం తీసింది

- అడ్డుగా ఉన్నాడని ఘాతుకానికి పాల్పడిన తల్లి
- బాలుడి హత్య కేసులో నిందితురాలి అరెస్టు
- ప్రేమించి పెళ్లి చేసుకున్నందుకు నరకం అనుభవించానన్న నిందితురాలు.. భర్త ప్రవర్తననే నేరానికి కారణమని ఆవేదన

6



దౌల్తాబాద్‌లో జీలుగ విత్తనాల కోసం గుమిగూడిన రైతులు

జీలుగు కోసం రైతుల అగచాట్లు

- కేంద్రాల వద్ద బారులు

7

కేశవరావు మరణంపై న్యాయ విచారణ జరపాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాలు

7

భర్తను వదిలించుకోవడానికే పసిబిడ్డ ప్రాణం తీసింది

● అడ్డుగా ఉన్నాడని ఘాతుకానికి పాల్పడిన తల్లి
● బాలుడి హత్య కేసులో నిందితురాలి అరెస్టు
● ప్రేమించి పెళ్లి చేసుకున్నందుకు నరకం అనుభవించానన్న నిందితురాలు.. భర్త ప్రవర్తననే నేరానికి కారణమని ఆవేదన

దుబ్బాక, మే23(ఆంధ్రజ్యోతి): భర్తతో వేగలేక, అతడిని వదిలించుకునేందుకు కన్నకొడుకు అడ్డం వస్తున్నాడని భావించి అభం శుభం తెలియని రెండు నెలల బాలుడిని కడతేర్చింది ఓ తల్లి. చేసిన నేరం నుంచి తప్పించుకునేందుకు కిడ్నాప్ డ్రామాలాడి చివరికి కటకటాలపాలైంది. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలను శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దుబ్బాక సీఐ శ్రీనివాస్ వెల్లడించారు. సిద్దిపేటరూరల్ మండలం పుల్లూరు గ్రామానికి చెందిన రామగల్ల శ్రీమాన్‌తో నంగునూర్ మండలం నర్మేట గ్రామానికి చెందిన కవితకు మూడేళ్లక్రితం ప్రేమవివాహం జరిగింది. అప్పటినుంచి ఆమె పుట్టింటితో పూర్తి సంబంధాలు తెగిపోయాయి. భర్తను నమ్మి వచ్చిన ఆమెకు చేదు అనుభవాలు ఎదురయ్యాయి. భర్త శ్రీమాన్ తాగుబోతు కావడం, దొంగతనాలు చేస్తుండటంతో అవమానంగా భావించింది. అంతేగాక రెండు పర్యాయాలు భర్త జైలుకు పోవడంతో పుల్లూరులోని కవిత అత్తగారితో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. వీటిని తాళలేక దంపతులిద్దరూ దుబ్బాక మండలం అప్పనపల్లిలోని శ్రీమాన్ అమ్మమ్మగారింటికి వచ్చి ఉంటున్నారు. భర్త ఈ నెల 17న అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలోని తన అక్క ఇంటికి వెళ్లి అక్కడే ఉన్నాడు. ఈ నెల 21న ఇంట్లోని అందరూ పక్కనే ఉన్న రావురూకుల గ్రామానికి శుభకార్యానికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన కవిత సాయంత్రం తన కుమారుడు దీక్షిత్‌కుమార్‌ను తీసుకుని వెళ్లి దగ్గరలోని పాడుపడిన బావిలో విసిరేసింది. దీన్ని నుంచి తప్పించుకునేందుకు ఇద్దరు వ్యక్తులు వచ్చి తన ఒడిలోని బాలుడిని అపహరించుకుపోయారని కట్టుకథ అల్లింది. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు గ్రామంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా తల్లి పసికందును తీసుకెళ్తున్నట్లు కనిపించడంతో తమదైన శైలిలో విచారణ చేపట్టగా అసలు విషయం బయటపడింది. తాను భర్తతో వేగలేకపోతున్నానని, తనకు పుట్టింటి సహకారం కూడా లేకపోవడంతో భర్తను వదిలించుకోవాలని అనుకున్నట్టు చెప్పింది. అందుకు పసిబాలుడు అడ్డువస్తున్నాడనే ఉద్దేశంతో తాను పడిన బాధలతో ఏ ఆలోచన లేకుండా నేరం చేశానని ఒప్పుకున్నది. హత్యానేరంతోపాటు, పోలీసులను తప్పుదారి పట్టించిన నేరం కింద కేసు నమోదుచేసి, శుక్రవారం రిమాండ్‌కు పంపినట్టు దుబ్బాక సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా దుబ్బాక ఎస్ఐ గంగరాజును, కానిస్టేబుళ్లను సీఐ అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గంగరాజు

భారీ వర్షం

● జగన్నాథ్‌పూర్ సమీపంలో పొంగిపొర్లిన వాగు
● పలుచోట్ల తడిసిన ధాన్యం

నారాయణఖేడ్/పెద్దశంకరంపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారు జాము వరకు కుండపోత వర్షం కురిసింది. నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ సమీపంలో వాగు పొంగిపొర్లింది. నారాయణఖేడ్ -బీదర్ జాతీయ రహదారి నిర్మాణం పనులు సాగుతుండడంతో పొంగిన వాగు నీరు ఆ గోతుల్లోకి చేరింది. దీంతో ఆ ప్రాంతం గుండా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. జగన్నాథ్‌పూర్ గ్రామస్థులు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఖేడ్‌లో 79.2 మి.మీలు, మనూరులో 78.06, కంగ్టిలో 17.4 , కల్హేర్‌లో 38.2, నాగల్‌గిద్దలో 49.4, సిర్గాపూర్‌లో 45.2, నిజాంపేటలో 68.6 మి.మీలు వర్షపాతం నమోదైంది. ఇక నాలుగైదు రోజులుగా వర్షం కురుస్తుండడంతో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

పెద్దశంకరంపేటలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. దీంతో పలు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని వరి ధాన్యం తడిసింది. వీరోజిపల్లితో పాటు ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. రైతులు అధైర్యపడొద్దని తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు.


ఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ సమీపంలో పొంగి పొర్లుతున్న వాగు

మూడుసార్లు ఆరబెట్టారు..

చిన్నశంకరంపేట మే 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గోమారంలో గొల్ల శేఖర్‌కు చెందిన ధాన్యం మూడు సార్లు ఆరబెట్టాల్సి వచ్చింది. రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం తేమ శాతం వచ్చే సమయానికి మూడుసార్లు అకాల వర్షాలకు తడవడంతో ధాన్యం మొలికెత్తినట్లు తెలిపారు. తడిసినప్పుడల్లా ఆరబెట్టడానికి నానా ఇబ్బందులు పడుతున్నామని మహిళా రైతు ఆవేదన వ్యక్తం చేశారు.


పెద్దశంకరంపేట మండలం వీరోజిపల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న పేట ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్


గోమారంలో మొలికెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న మహిళా రైతు

నగల కోసమే దివ్యాంగురాలి హత్య

రామాయంపేట,మే 23 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధి లోని గండ్ల శివారులో ఈ నెల 12న జరిగిన దివ్యాంగురాలి హత్య కేసును పోలీసులు ఛేదించారు. శుక్రవారం నిందుతుడిని అరెస్టు చేసి మూడున్నర తులాల బంగారు ఆభరణాలు స్వాధీనపరచుకున్నారు. సీఐ వెంకటరాజ గౌడ్ వెల్లడించి వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా గుర్జాల గ్రామానికి చెందిన దివ్యాంగురాలు బ్యాగరి మణెమ్మ(37).. పొరుగు గ్రామమైన రామలక్ష్మణపల్లి నివాసి కొండని రవీందర్‌కు మధ్య వివాహేతర సంబంధం ఉంది. ఇటీవల తన కూతురు వివాహంలో మణెమ్మ మెడలో వేసుకున్న బంగారు నగలను చూసిన రవీందర్ ఎలాగైనా వాటిని కొట్టేయాలని పన్నాగం వేశాడు. ఈ మేరకు యాదగిరిగుట్ట వెళ్దామని ఆమెను కామారెడ్డికి పిలిపించుకొని అక్కడి నుంచి తన కారులో తొలిగండ్ల శివారులో తీసుకువచ్చి బండరాయితో కొట్టి చంపాడు. 11 రోజులుగా వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఎట్టకేలకు నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటరాజా గౌడ్

13 కిలోల గంజాయి పట్టివేత

రామచంద్రాపురం, మే 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో గంజాయి గుప్పు మంటుంది. రాష్ట్రాలు దాటుతూ గంజాయి ఇక్కడికి చేరుతుండటంతో పోలీసులు గంజాయి ముఠాలపై నిఘా పెంచారు. ఈ క్రమంలోనే ఆటోలో తరలిస్తున్న 13 కిలోల గంజాయిని ఎస్‌ఓటీ, కొల్లూరు పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఉత్తం బర్మన్ (37) అపర్ణ నిర్మాణ సంస్థ లేబర్ క్యాంప్‌లో పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. అతడు మేఫేర్ సంస్థలో సెంట్రింగ్ మేస్త్రీగా పనిచేస్తున్న వెస్ట్ బెంగాల్‌కు చెందిన బిస్వాస్(27) స్నేహితుడు. అదేరాష్ట్రానికి చెందిన కృష్ణ విజయవాడలో గంజాయిని విక్రయిస్తుంటాడు. గురువారం విజయవాడకు బస్సులో వెళ్లిన బర్మన్, బిస్వాస్ శుక్రవారం ఉదయం అతడి వద్ద 13 కిలోల గంజాయి తీసుకుని లింగంపల్లికి చేరుకున్నారు. తిరిగి కొల్లూర్‌కు ఆటోలో బయలుదేరారు. ముందే ఈ విషయాన్ని పసిగట్టిన పోలీసులు వారిని ఉస్మాన్‌నగర్‌లో పట్టుకున్నారు. ఈ మేరకు గంజాయిని స్వాధీన పరుచుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.


నిందితులు బర్మన్, బిస్వాస్

స్కూటీని ఢీకొన్న ఆటో.. యువకుడి మృతి

మెదక్ అర్బన్, మే 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఘోరరోడ్డు ప్రమాదం జరిగింది. స్కూటీని ఆటో ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి మెదక్ పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిల్‌ఎపెడ్ మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామానికి చెందిన కొత్తకాపు వికాస్‌రెడ్డి(16), మెదక్‌లోని శాంతినగర్‌కు చెందిన మిత్రుడు కండెల అఖిల్‌తో కలిసి గురువారం రాత్రి 8:30 గంటలకు బైక్ (టీజీ35 3605)పై బోధన చౌరస్తా నుంచి టౌన్‌లోకి వస్తున్నాడు. ఈ క్రమంలో రాంగ్‌రూట్‌లో వచ్చి ఆటో (టీజీ 35టీ 3698) ఢీకొట్టింది. దాంతో వికాస్‌రెడ్డికి మెడపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్సులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు.


వికాస్‌రెడ్డి (ఫైల్)

చికిత్స పొందుతూ వ్యక్తి..

కొడిపల్లి, మే(ఆంధ్రజ్యోతి)23: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని రాజిపేట్ గ్రామానికి చెందిన తోళ్ల రమేష్(17)తో పాటు మరో యువకుడు ఈ నెల 13న మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్ గేట్ సమీపంలో జాతీయ రహదారి 765డీపై ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. అదే సమయంలో నర్సాపూర్ వైపు నుంచి మెదక్ వైపు వస్తున్న కారు ఎదురుగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రమేష్‌ను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు.

ఇద్దరిని ఢీ కొట్టిన కారు

● ఆస్పత్రికి తరలిస్తే అంబులెన్స్‌లోనే పరీక్షలు జరిపిన వైద్యసిబ్బంది

చేర్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపక్కన బైక్ నిలుపుకుని మాట్లాడుకుంటున్న అన్నదమ్ములను గుర్తుతెలియని వ్యక్తి కారును అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి ఢీ కొట్టి పరారైన సంఘటన శుక్రవారం ఉదయం మండలంలోని వీరన్న పేట గ్రామశివారులో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆ గ్రామానికి చెందిన సాతెల్లి రమేశ్, సాతెల్లి బాలనర్సు ఇరువురు శుక్రవారం ఉదయం గ్రామశివారులోని ఆర్టీసీ రిక్వెస్ట్‌స్టాప్ వద్ద వేర్వేరుగా బైక్‌లపై ఆగి ముచ్చటిస్తున్నారు. ఇంతలో జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం సోలామైల్ వైపు నుంచి గుర్తుతెలియని వ్యక్తి కారును అతివేగంగా నడుపుకుంటూ వచ్చి వారి ఢీ కొట్టి పరారయ్యాడు. దీంతో రమేశ్, బాలనర్సులు ఇరువురికి కాళ్లు, చేతులు విరిగి గాయాలపాలయ్యారు.

వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై పలువురి ఆగ్రహం..

ప్రమాదంలో గాయపడిన వీరిద్దరిని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, వారు ఘటనాస్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స జరిపి మెరుగైన చికిత్స కోసం చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కానీ బాధితులను ఆస్పత్రిలోపల డ్రెస్సింగ్ చేసి చికిత్స జరిపాల్సిన వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అంబులెన్స్‌లోనే నామమాత్రంగా పరీక్షించి ఉన్న తాస్పత్రికి తీసుకుని వెళ్లమని సూచించి చేతులు దులుపుకున్నారు. కాగా కొద్దిరోజులుగా ప్రమాదాలబారిన పడి ఆస్పత్రికి వచ్చేవారి పట్ల డ్యూటీ డాక్టర్లు, సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఆరుబయట అంబులెన్స్‌లోనే పరీక్షించి పంపిస్తూ కాఠిన్యాన్ని ప్రదర్శిస్తున్నారని వాపోతున్నారు. వరుస సంఘటనలు చోటుచేసుకుంటున్న విషయమై ఉన్నతాధికారులు స్పందించి డ్యూటీ డాక్టర్, సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా, కారుతో ఢీకొట్టి పరారైన గుర్తుతెలియని వ్యక్తిని పట్టుకునేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


ఆస్పత్రి ఆవరణలో అంబులెన్స్‌లో పరీక్షిస్తున్న సిబ్బంది


సీఎం ప్రసంగాన్ని సెల్‌ఫోన్‌లో రికార్డు చేస్తున్న మహిళలు


సభాస్థలి వద్ద నిమ్జ్ గ్రీన్ కారిడార్ రోడ్డు ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి


విద్యార్థినికి ట్యాబ్ అందజేస్తూ..


స్టాల్‌ను సందర్శిస్తూ..


కేంద్రీయ విద్యార్థులతో..

గుండెల్లో పెట్టుకుంటాం

(5వ పేజీ తరువాయి)

అద్భుతంగా నిర్వహించుకోవచ్చని సూచించారు. నిమ్జ్ నిర్వాసితులకు జరిగిన నష్టం గురించి మంత్రి దామోదర రాజనర్సింహ, జహీరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ తన దృష్టికి పలుమార్లు తీసుకొచ్చారని, వారికి న్యాయం జరిగే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. జహీరాబాద్ పట్టణంలోని బసవేశ్వర విగ్రహాన్ని ప్రారంభించిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. సమాజంలో అణచివేతకు గురైన బలహీనవర్గాల తరపున బసవేశ్వరుడు నిలబడ్డాడని గుర్తు చేశారు. ఆ రోజుల్లో అనుభవ మంటపాలను ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు పరిష్కరించేవారని వివరించారు. ఆనాటి అనుభవ మంటపాల ఆధారంగానే నేడు శాసనసభ, పార్లమెంటులో సమస్యల పరిష్కారం కోసం మాట్లాడుతున్నామని తెలిపారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం

రూ.494.67 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

జహీరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం రూ.494.67 కోట్లు విలువ చేసే పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఝరాసంగం మండలంలోని మాచ్నూర్‌లో కేంద్రీయ విద్యాలయ భవనాన్ని ప్రారంభించారు. హుగ్గెల్లిలో బసవేశ్వరుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. సభాస్థలి నుంచే గ్రీన్ కారిడార్ నిమ్జ్ రోడ్డు, రైల్వే ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించారు. చిరాగ్‌పల్లి- ఇప్పపల్లి గ్రామాల మధ్య రూ.20 కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులకు, పట్టణంలో అమృత్ 2.0 కింద రూ.66 కోట్లతో నీటి సరఫరా అభివృద్ధి పనులకు, రోడ్ల అభివృద్ధికి గాను రూ.97 కోట్ల మేర పనులకు, రూ.6 కోట్లతో కేజీబీవీ పాఠశాల భవనాలు, నారాయణఖేడ్, జహీరాబాద్, బొంతపల్లి, ముంబాపూర్, కాజీపల్లి ప్రాంతాల్లో రూ.9.60 కోట్లతో అర్బర్ పార్కుల అభివృద్ధికి శంకుస్థాపనలు చేశారు. అలాగే కోహీర్ మండలం కవేలిలో రూ.1.99 కోట్ల వ్యయంతో మహిళలతో పెట్రోల్‌బంక్ నిర్వాహణ ప్రారంభం, 294 మంది నిమ్జ్ భూబాధిత రైతులకు రూ.41 కోట్లు విలువ చేసే చెక్కులు, స్వయం సహాయక బృందాల మహిళలకు రూ.3 కోట్ల బ్యాంకు లింకేజీ రుణం చెక్కులను అందజేశారు. దీంతో పాటు ప్రాంగణం వద్ద జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించగ వాటిని సీఎం సందర్శించారు. కేజీబీవీ విద్యార్థులకు న్యూట్రిషన్‌కిట్‌లు, ట్యాబ్‌లను అందజేశారు.

నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు



బసవేశ్వరుడి విగ్రహాన్ని ప్రారంభిస్తూ...

సీఎం సభ సాగిందిలా..

కోహీర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి షెడ్యూల్ ప్రకారం ఉదయం 11.5 గంటలకు జహీరాబాద్‌కు రావాల్సి ఉండగా మధ్యాహ్నం 12.30 గంటలకు హెలికాప్టర్‌లో జహీరాబాద్ చేరుకున్నారు. ఆయనతోపాటు మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్‌అలీ ఉన్నారు. హెలీపాడ్ వద్ద ముఖ్యమంత్రికి మంత్రి దామోదర్ రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, కలెక్టర్ వల్లూరు క్రాంతి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, నాయకులు ఉజ్వల్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాహనంలో జహీరాబాద్ సమీపంలోని హుగ్గెల్లి వై-జంక్షన్ వద్దకు 12.40 గంటలకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన బసవేశ్వరస్వామి విగ్రహాన్ని ఆవిష్కరించి రెండు నిమిషాల పాటు ప్రసంగించారు. అనంతరం ఝరాసంఘం మండలంలోని మాచ్‌నూరు గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించేందుకు బయలుదేరారు.

● మధ్యాహ్నం 1.00 గంట సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించి విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించారు. అక్కడి నుంచి బయలుదేరిన ముఖ్యమంత్రి రోడ్డు మార్గాన నేరుగా జహీరాబాద్‌లోని పీవీఆర్ గార్డెన్‌కు ఎదురుగా ఏర్పాటు చేసిన పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొనేందుకు బయలుదేరారు. మధ్యాహ్నం ఒంటిగంట 1.16 నిమిషాలకు సభ స్థలానికి చేరుకున్నారు.

● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొదట సభా స్థలి వద్ద మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను పరిశీలించాలి. సభా వేదిక వద్ద జహీరాబాద్ రైల్వే ఓవర్ బ్రిడ్జి, నిమ్జ్ రోడ్డును ప్రారంభించారు. అనంతరం 1.40 నిమిషాలకు వేదికపైకి చేరుకున్నారు. దీంతో పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన చేశారు.

● అనంతరం ఎంపీ సురేష్‌కుమార్ హెట్కార్, స్థానిక ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ మంత్రి చంద్రశేఖర్, మంత్రులు కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహ వరుసగా ప్రసంగించారు.

● 2.29 గంటలకు సీఎం తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రి ప్రసంగం ప్రారంభించిన ఐదు నిమిషాలకే సభలో ఉన్న పలువురు మహిళలు, పురుషులు సభ నుంచి వెళ్లిపోయిన దృశ్యాలు కనిపించాయి. సభ నుంచి వెళ్ళిపోతున్న ప్రజలను పోలీసులు అల్గోల్‌కు వెళ్లే ప్రధాన రహదారిపైనే నిల్పోబెట్టారు.

● మధ్యాహ్నం 2.55 గంటకు సీఎం ప్రసంగం ముగిసింది. అనంతరం అక్కడి నుంచి నేరుగా మూడు గంటల సమయంలో హెలీపాడ్ వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం 3.08 గంటలకు హెలికాప్టర్ అక్కడి నుంచి టేకాఫ్ అయింది.


ముఖ్యమంత్రి సభకు తరలివస్తున్న మహిళలు

సీఎం పర్యటనతో ముందస్తు అరెస్టులు


అరెస్టు చేయడంతో పోలీస్ స్టేషన్ ఎదుట ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

గుమ్మడిదల, మే 23 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం సంగారెడ్డి జిల్లాలో పర్యటన దృష్ట్యా గుమ్మడిదల మండలంలో ప్యారానగర్‌లో డంపుయార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనకారులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ముందుగా నల్లవల్లి గ్రామంలో జేఏసీ నాయకులను గుమ్మడిదల పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఉద్యమంలో కీలకపాత్ర పోషిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, జేఏసీ నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. ప్రభుత్వ తీరుపై ఆందోళనకారులు విరుచుకుపడ్డారు. సామరస్యంగా నిరసన తెలుపుతూ తమ విజ్ఞప్తి చేస్తుంటే ప్రభుత్వ ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. అరెస్టులు, నిర్బంధాలకు భయపడేది లేదని, డంపింగ్ యార్డు నిర్మాణం ఆపేవరకూ ఉద్యమం ఆగదని చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కేశవరావు మరణంపై న్యాయ విచారణ జరపాలి

● రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాలు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

సిద్దిపేట కలెక్టరేట్, మే 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల నిర్మూలనే లక్ష్యంగా రాజ్యాంగ విరుద్ధంగా చేపడుతున్న ఆపరేషన్ కగార్ తక్షణమే ఆపి శాంతి చర్చలు జరపాలని రాజకీయ, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాగుల భూపతి అధ్యక్షతన నిర్వహించారు. దీనికి హాజరైన పలువురు వక్తలు మాట్లాడుతూ సీపీఐ మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నాంబాల కేశవరావు మరణం పై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఆయన మరణంపై తక్షణమే సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. శత్రు దేశంగా భావించే పాకిస్థాన్‌తో శాంతి చర్చలు జరిపే మోడీ.. పేదల పక్షాన సుదీర్ఘకాలంగా అనేక త్యాగాలకు ఓర్చి ఉద్యమిస్తున్న మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరిపేందుకు ఎందుకు ముందుకు రావడం లేదో తెలపాలన్నారు. నిరాయుధులుగా ప్రాణాలతో దొరికిన మావోయిస్టులను పోలీసులు అనేక చిత్రహింసలకు గురిచేసి ఉద్దేశపూర్వకంగా చంపి ఎన్‌కౌంటర్ అంటూ కట్టు కథలు అల్లుతున్నారని మండిపడ్డారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ విషయం పై అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శశిధర్, సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు విజయ్ కుమార్, ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ సత్తయ్య, బీఆర్ఎస్ నాయకులు పోచబోయిన శ్రీహరి యాదవ్, సత్యనారాయణ గౌడ్, భీమసేన, జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు రంగాచారి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్, ఏఐటియుసీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, గోపాల స్వామి పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలి

● సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట కలెక్టరేట్, మే 23(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది 6500 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేసే లక్ష్యాన్ని పూర్తి చేయాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఆయిల్ ఫెడ్, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి సువర్ణ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 12,339 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతుందని తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను 6500 ఎకరాల లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటివరకు 1612 ఎకరాలు 456 మంది రైతులను గుర్తించినట్లు తెలిపారు. 209 రైతుల నుంచి 661.5 ఎకరాల డీడీలు సేకరించినట్లు తెలిపారు. ఆయిల్ పామ్ పంట 674 టన్నుల గెలలు కట్ చేసి ఖమ్మం జిల్లా అశ్వారావుపేటలోని ఫ్యాక్టరీ కి పంపినట్లు వివరించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రూ.300 కోట్లతో నిర్మిస్తున్న ఆయిల్ పామ్ కర్మాగారం అతి త్వరలో పూర్తవుతుందన్నారు. ఇదివరకు నిర్వహించిన సమావేశానికి ఈరోజుకి పనుల్లో చాలా ప్రోగ్రెస్ వచ్చిందని అధికారులను అభినందించారు. సమావేశంలో టీజీ ఆయిల్ ఫెడ్ ఓఎస్‌డీ (ప్లాంటేషన్) కిరణ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక, ఆయిల్ ఫెడ్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల అవకతవకలపై విచారణ


మల్యాల గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో మల్లికార్జున్‌రెడ్డి

నంగునూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్లమల్యాల గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగంపై శుక్రవారం డీఎల్ఎల్‌పీవో మల్లికార్జున్‌రెడ్డి విచారణ చేపట్టారు. రికార్డుల నిర్వహణ పంచాయతీ నిధులపై ఆరా తీశారు. ఇంటి పన్నుల జమ చేయడంలో పంచాయతీ కార్యదర్శిపై ఆరోపణలు రావడంతో తనిఖీ చేపట్టారు. ఇంటి నిర్మాణం కోసం పంచాయతీ కార్యదర్శి రూ.20 వేల నుంచి రూ.30 వేలు వసూలు చేస్తున్నారని ఈ సందర్భంగా గ్రామస్థులు జిల్లా అధికారి దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ఇంటిపన్ను చెల్లించడం లేదని, ఉపాధి హామీ కూలీలకు పనులు కూడా కల్పించడం లేదని వారి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని చెప్పారు. ఈ మేరకు గ్రామ పంచాయతీకి సంబంధించిన రికార్డులను అధికారులు సీజ్ చేశారు. డీఎల్‌పీవో వెంట ఎంపీడీవో కార్యాలయ సూపరిండెంట్, ఇన్‌చార్జి ఎంపీవో ప్రభాకర్ రావు తదితరులు ఉన్నారు.

నేడు సత్యసాయి సంజీవని ఆసుపత్రిని సందర్శించనున్న పుల్లెల గోపీచంద్

● 100 చిట్టి గుండెల ఆపరేషన్ల మైలురాయి దాటిన ఆసుపత్రి

కొండపాక, మే 23 (ఆంధ్రజ్యోతి) : కొండపాక ఆనంద నిలయం శివారులోని సత్యసాయి సంజీవని హార్ట్ సెంటర్‌ను ఇండియన్ బ్యాడ్మింటన్ చీఫ్ నేషనల్ కోచ్ పుల్లెల గోపీచంద్ శనివారం సందర్శించనున్నారు. కొండపాక సంజీవని ఆసుపత్రిలో పుట్టుకతో గుండె వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల ఆపరేషన్‌ల కార్యక్రమం నవంబర్ నుంచి నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 108 మంది చిన్నారులకు ఆపరేషన్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరిగే గిఫ్ట్ ఆఫ్ లైఫ్ కార్యక్రమానికి గోపీచంద్, కలెక్టర్ మను చౌదరి పాల్గొంటారని ఆసుపత్రి ప్రతినిధి జగన్నాథ శర్మ తెలిపారు. ఆస్పత్రిలో మూడో విడత వరకు 83 ఆపరేషన్లు పూర్తికాగా మే 13 నుంచి ఈ రోజు వరకు 25 ఆపరేషన్లను పూర్తి చేశారు. మొత్తం 108 ఆపరేషన్‌లు పూర్తయిన సందర్భంగా జరిగే కార్యక్రమానికి వారు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

పోలీసుల జోక్యంతో బాధితురాలికి న్యాయం



ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలుపుతున్న గీత

చిన్నశంకరంపేట మే 23 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని దొంతి గ్రామంలో అప్పు తీర్చాలని సొంత చెల్లి ఇంటికే తాళం వేసిన అన్న అనే వార్త కథనం బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురించడంతో పోలీస్ అధికారులు స్పందించారు. తూప్రాన్ సీఐ కృష్ణ ఆదేశాల మేరకు శివ్వంపేట ఎస్ఐ మధుకర్‌రెడ్డి జోక్యం చేసుకుని బాధితురాలికి న్యాయం చేశారు. దొంతి గ్రామానికి చెందిన గోత్రాల గీత ఇంటికి తాళం వేయడంతో ఐదు రోజులుగా ఆరుబయట ఉంటున్న ఆమె తాళం తీయించి ఇంట్లోకి పంపించారు. దీంతో ఆంధ్రజ్యోతి దినపత్రికకు గీత ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఐఐటీహెచ్‌లో 26 నుంచి భారతీయ కళలపై అంతర్జాతీయ సదస్సు

● దేశ, విదేశాల నుంచి 1500 మంది రాక

కంది, మే 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఈ నెల 26 నుంచి జూన్ 1 వరకు భారతీయ కళలపై అంతర్జాతీయ సదస్సు జరగనున్నదని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ అమాంగ్స్ యూత్ (ఎస్‌పీఐసీ ఎమ్‌ఏసీఏవై) ఆధ్వర్యంలో ఏటా దేశంలో ఏదో ఒక ప్రముఖ విద్యాసంస్థలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సారి ఐఐటీ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. ఇందులో సీనియర్ బ్యూరోక్రాన్లు, విద్యావేత్తలు, భారతీయ కళా-సంస్కృతిని పరిరక్షించేందుకు పాటుపడుతున్న ఎస్‌సీఐసీ ఎంఏసీఏవై సలహామండలిలోని విశిష్ట సభ్యులు పాల్గొంటారు. ఈ భారతీయ శాస్త్రీయ సంగీతం, నృత్యం, వారసత్వ కళలు, సంస్కృతి, సాంప్రదాయాల వేడుక కోసం దేశ విదేశాల నుంచి సుమారు 1500 మందికి పైగా విద్యార్థులు, స్వచ్ఛంద సేవకులు హాజరుకానున్నారు. అంతర్జాతీయ సదస్సుకు ఐఐటీహెచ్ వేదికగా మారడం గర్వకారణంగా ఉందని సంస్థ డైరెక్టర్ బీఎస్ మూర్తి పేర్కొన్నారు.

జీలుగ విత్తనాల కోసం రైతుల బారులు

● దౌల్తాబాద్ అగ్రోస్ కేంద్రానికి వచ్చింది 140 బస్తాలే..

● జీలుగ, జనుము కోసం రైతులకు తప్పని తిప్పలు

దౌల్తాబాద్, మే23 (ఆంధ్రజ్యోతి) : దౌల్తాబాద్ మండల కేంద్రంలోని అగ్రోస్ కేంద్రం వద్ద జీలుగ, పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతులు శుక్రవారం బారులు తీరరారు. కేవలం 140 జీలుగ విత్తనాల బస్తాలు మాత్రమే రావడంతో వాటిని క్యూలో ముందు వచ్చిన రైతులకు అందజేశారు. గంటల తరబడి పడిగాపులు కాసి విత్తనాలు దొరకని మిగతా రైతులు దుకాణ యజమాని, వ్యవసాయశాఖ అధికారులపై మండిపడ్డారు. మొదట్లోనే సరిపడా జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచుకపోతే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. డిమాండ్‌ను బట్టి సరిపడా విత్తనాలను త్వరగా తెప్పించాలని కోరారు.

తెరుచుకోని అగ్రోస్ రైతు సేవా కేంద్రం

దౌల్తాబాద్ మండల కేంద్రంలోని అగ్రోస్ రైతు సేవా కేంద్రం గురువారం తెరుచుకోలేదు. వానకాలంలో జీలుగ, జనుము విత్తనాల కోసం అగ్రోస్ రైతుసేవా కేంద్రం వద్దకు ఆయా గ్రామాలకు చెందిన రైతులు వచ్చి చూడగా ఆ కేంద్రం ముసి ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్రోస్ దుకాణ యజమానికి ఫోన్ చేసి జీలుగ విత్తనాలు ఎప్పుడు వస్తాయాని అడగడంతో రెండుమూడు రోజులు సమయం పడుతుందని తెలుపడంతో అసహనంతో వెనుదిరిగారు. వానకాలం దగ్గర పడుతుండడంతో జీలుగ విత్తనాలు ఎప్పుడు సాగు చేయాలని మండిపడ్డారు. రైతులకు సరిపడా జీలుగ విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని మండలానికి చెందిన పలు గ్రామాల రైతులు కోరారు.

మొదట్లోనే ఇలా అయితే ఎలా..



జీలుగ కోసం మండలం నుంచి నాలు మూల నుంచి తరలి వచ్చిన రైతులకు మొదటి రోజే నిరాశ ఎదురైంది. మండలంలో సూమారు 8 వేల నుంచి 10 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. గంటలోనే 140 జీలుగ విత్తనాల బస్తాలు అయిపోయాయి. మళ్లీ వస్తాయే రావో అని రైతులు మదనపడుతున్నారు. రైతులకు సరిపడా జీలుగను సరఫరా చేసేందుకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. రెండు రోజుల్లో విత్తనాలు అందిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

- రాజలింగం గౌడ్, ఉప్పరపల్లి, దౌల్తాబాద్ మండలం

న్యూస్ బాక్స్

గురుకులాల పూర్వ విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ

సిద్దిపేట కల్చరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తుందని గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ పాలోజు నరసింహాచారి తెలిపారు. 2017 నుంచి గురుకుల పాఠశాల, కళాశాలలో చదివి, 18 నుంచి 25 మధ్య వయసున్న యువతీ, యువకులు ఇప్పటి వరకు ఉద్యోగం పొందని వారు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు నెలరోజుల పాటు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో చదువుకున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఖరీఫ్ సీజన్‌కు జీలుగ, జనుము విత్తనాలు సిద్ధం

కోహెడ, మే 23 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలంలో ఖరీఫ్ సీజన్‌కు పచ్చిరొట్ట ఎరువులు రైతులకు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి సతీష్ తెలిపారు. మండలానికి జనుము (70 క్వింటాళ్లు), జీలుగ (100 క్వింటాళ్లు), విత్తనాలు 50 శాతం సబ్సిడీతో ఆగ్రోస్, డీసీఎంఎస్ ద్వారా అందుబాటులో ఉన్నాయన్నారు. కావల్సిన రైతులు తమ పట్టా పాస్ బుక్ జిరాక్స్ తీసుకుని ముందుగ రైతువేదికకు వచ్చి ఏఈవో దగ్గర పర్మిట్ తీసుకోవాలన్నారు. అనంతరం ఆగ్రోస్ డీసీఎంఎస్ ద్వారా సబ్సిడీ విత్తనాలను సబ్సిడీపై పొందాలన్నారు.

108 వాహనం తనిఖీ

కొండపాక, మే 23 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం 108 అంబులెన్స్ వాహనాన్ని ఈఎంఆర్ఐ మెదక్ ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ జాన్ షాహిద్ శుక్రవారం తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి తగు సూచనలు చేశారు. ప్రథమ చికిత్స అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించ కూడదని తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కోఆర్డినేటర్ హరిరామ కృష్ణ, మెడికల్ టెక్నీషియన్స్ మహేందర్, శ్రీనివాస్ పైలెట్స్ రమేష్, రాంచంద్రం ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి: బీజేపీ

వర్గల్, మే 23 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయ్యాలని వర్గల్ మండల బీజేపీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నెంటూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టుకున్న ధాన్యాన్ని పరిశీలించారు. .

పేదలకు అందని వైద్యం

కోహెడ, మే 23 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సర్కారు వైద్యం అందని ద్రాక్షగా మారిందని బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, మాజీ ఎంపీటీసీ స్వరూప పేర్కొన్నారు. శుక్రవారం కోహెడలో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం రూ.కోట్లాదిగా వెచ్చించి డాక్టర్లు, సిబ్బందిని ఏర్పాటు చేస్తే, కోహెడలో ఉదయం పూట మాత్రమె వైద్యం ఆందుతుందని, సాయంత్రం ఐదు దాటితే వైద్యం కరువు అవతుందన్నారు. కోహెడ ప్రభుత్వ హాస్పిటల్ లో 24 గంటలు వైద్యసేవలు అందించాల్సి ఉందన్నారు.

రైతులను మోసగిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలి

గజ్వేల్, మే 23(ఆంధ్రజ్యోతి): రైతులను మోసం చేస్తున్న మిల్లు యజమానులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వెంట నాయకులు బండ్ల స్వామి, రంగారెడ్డి ఉన్నారు.

అధ్వానంగా చేర్యాల రైతువేదిక

- కుంగిన ఫ్లోరింగ్, దెబ్బతిన్న పైకప్పు
- గోడలకు పగుళ్లు
- చినుకు పడితే ఆవరణ మొత్తం చిత్తడే
- అధికారుల తీరుతో అన్నదాతలకు తిప్పలు






చేర్యాలలో రైతువేదిక భవనం, గోడకు ఏర్పడిన పగుళ్లు, కుంగిన ఫ్లోరింగ్‌తో ప్రమాదకరంగా టైల్స్



ఆవరణలో కొట్టుకుపోయిన ఫ్లోరింగ్

చేర్యాల,మే 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరిగే అభివృద్ధిలపై సరైన పర్యవేక్షణ లేక పూర్తయిన కొన్నాళ్లకే పనుల్లో డొల్లతనం బయటపడుతోంది. ప్రజాధనం వృథా చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చేర్యాల పట్టణ శివారులోని రైతువేదిక ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రస్తుతం చేర్యాల రైతువేదిక భవనం అధ్వానంగా మారి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపులేనితనాన్ని, పనుల్లో నాణ్యతా లోపాలను ఎత్తి చూపుతున్నది.

నిర్వహణపై పట్టింపు లేదా?

చాన్నాళ్లుగా చేర్యాల రైతువేదికలో మునిసిపల్ కార్యాలయ సమీక్షా సమావేశాలు, రైతు, వ్యవసాయ సంబంధిత అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు. కానీ సక్రమ నిర్వహణ లేకపోవడంతో పాటు పర్యవేక్షించే వారు కరువవడంతో భవనంతో పాటు పరిసరాలు రోజురోజుకూ అధ్వానంగా మారుతుంది. రైతువేదిక లోపలిభాగంలో గోడలకు పగుళ్లు పట్టి బీటలు వారుతున్నాయి. రేకులపైకప్పు దెబ్బతిని వర్షానికి నీరు కారుతున్నాయి. కొంతభాగం ఫ్లోరింగ్ టైల్స్ ప్రమాదకరంగా కుంగిపోయాయి. వేదిక ఆవరణ చుట్టూ ఫ్లోరింగ్ దెబ్బతిని గుంతలమయంగా మారింది. వేదికకు చేరుకునే మార్గం సరిగా లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా బురదతో చిత్తడిగా మారి నడవటానికి కూడా వీలులేకుండా పోతున్నది. అటువైపు వెళ్లాలంటేనే రైతులు ఇబ్బంది పడుతున్నారు.

అధికారులపై రైతుల ఆగ్రహం

వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలకు సంబంధించి రైతుల వివరాల నమోదు కోసం వేదిక వద్దకు వెళ్తున్న రైతులపట్ల వ్యవసాయశాఖ సిబ్బంది సక్రమంగా అందుబాటులో ఉండకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరిగిపోతున్నారు. ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతారో తెలియడం లేదని రైతులు వాపోతున్నారు. ఫోన్‌లో సంప్రదిస్తే వేళాపాలా లేదా అంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నారని రైతులు చెబుతున్నారు. అధికారుల తీరుతో రైతుబంధు ఇతరత్రా ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కోల్పోతున్నారు. రైతువేదిక వద్ద కనీసవసతులు లేక అధ్వానపరిస్థితులు నెలకొన్నప్పటికీ సంబంధిత అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా అధికారులు రైతు వేదిక వద్ద మరమ్మతులు చేపట్టాలని, వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండి సక్రమంగా విధులు నిర్వహిస్తే రైతులకు సౌకర్యంతో పాటు రైతువేదిక భవన నిర్వహణ సైతం సజావుగా కొనసాగే వీలుంటుందని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

జీపీవో స్ర్కీనింగ్ టెస్ట్‌కు పటిష్ట బందోబస్తు

సిద్దిపేట కల్చరల్/సిద్దిపేట క్రైం/సిద్దిపేట కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి): పూర్వ వీఆర్‌వో, వీఆర్‌ఏలకు పరీక్ష (జీపీవో స్ర్కీనింగ్ టెస్ట్) కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సిద్దిపేట సీపీ తెలిపారు. ఈ నెల 25న జరిగే పరీక్ష కోసం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రం వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అములులో ఉంటుందన్నారు. పరీక్ష జరిగే రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అమల్లో ఉంటుందన్నారు. పరీక్ష జరిగే సమయంలో సమీపంలోని జిరాక్స్ సెంటర్స్ మూసి వేయాలని, పరీక్ష కేంద్రం నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దన్నారు. పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

● హైదరాబాదులో ఓ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన మిస్ రేడియన్స్ లుక్ ఆఫ్ తెలంగాణ మిస్ ఫొటోజెనిక్ విభాగంలో అక్బర్‌పేట భూంపల్లి మండలం రుద్రారం గ్రామానికి చెందిన తుమ్మల ఆర్తి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం జిల్లాకలెక్టర్, సీపీలను మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ మను చౌదరి శాలువాతో సన్మానించి బహుమతి అందజేశారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆల్ ద బెస్ట్ తెలిపారు. అనంతరం కమిషనర్ కార్యాలయంలో పోలీస్ సీపీ డాక్టర్ బి.అనురాధను మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీ ఆమెను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆర్తి కుటుంబసభ్యులు కలెక్టర్, సీపీలతో కలిసి ఫొటోలు దిగారు.



తుమ్మల ఆర్తిని అభినందిస్తున్న సీపీ బి. అనురాధ

కలెక్టర్‌ను కలిసిన ఏసీపీ

సిద్దిపేట కలెక్టరేట్, మే 23(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట నూతన ఏసీపీ రవీందర్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ మను చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. జిల్లా కేంద్రంలో శాంతి భద్రతలకు ఎలాంటి భంగం కలగకుండా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఏసీపీకి సూచించారు. కాగా హైదరాబాద్ లో ఇంటలిజెన్స్ ఏసీపీగా విధులు నిర్వహించి బదిలీపై జిల్లాకు విచ్చేశారు. ఇదివరకు ఏసీపీగా పనిచేసిన మధు డీజీపీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న ఏసీపీ రవీందర్ రెడ్డి

మల్లన్న ఆలయంలో వేలంపాట

చేర్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం ఈవో అన్నపూర్ణ ఆధ్వర్యంలో పలు విభాగాలకు సంబంధించిన సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలంపాట నిర్వహించారు. కొబ్బరికాయల విక్రయంతో పాటు మొక్కుబడులుగా సమర్పించిన కొబ్బరి ముక్కలు, శేషవస్త్రా లు, పసుపు, ఒడిబియ్యం సేకరణ, వెండి కోరమీసాలు, శేషవస్త్రాల విక్రయం, కూరగాయల సరఫరా, టాయిలెట్ బ్లాకుల నిర్వహణ తదితర అంశాలకు సంబంధించి వేలంపాటలు చేపట్టారు. ఈమేరకు సనాది కరుణాకర్ రూ.15లక్షలకు హెచ్చుపాటపాడి పాదరక్షలు భద్రపరిచే హక్కు, ఎల్లమ్మ ఆలయంలో భక్తులు సమర్పించిన వస్త్రాలు, ఒడిబియ్యం సేకరణకు రూ.18.30లక్షలకు సానాది వెంకటేశ్, ఆలయానికి కూరగాయలు సరఫరా చేసే హక్కు చల్లా మౌనిక పొందారు. మిగతావాటికి సంబంధించి వేలంపాటదారులు ఆసక్తి కనబరచకపోవడం, గతేడాది కన్నా తక్కువ పాట రావడం, నిబంధనల ప్రకారం షెడ్యూల్స్ దాఖలుకాకపోవడం వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని వాయిదా వేసినట్లు ఈవో తెలిపారు.

ఘనంగా మహంకాళమ్మ ఉత్సవం

దుబ్బాక, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని హబ్షీపూర్ గ్రామంలో శుక్రవారం మహంకాళమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వేర్వేరుగా వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు వేలేటి జయరామశర్మ, రామకృష్ణశర్మలు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

పేదవిద్యార్థుల ఉన్నత చదువులకు సహకరించాలి



సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల మహంకాళి ఆలయంలో మాజీమంత్రి హరీశ్‌రావు తదితరులు

సిద్దిపేట అర్బన్/సిద్దిపేట కల్చరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట నియోజకవర్గ శ్రీకృష్ణయాదవ ఫంక్షన్‌హాల్ నూతన పాలకవర్గం ఇటీవల ఎన్నికైన సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం మాజీమంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు నూతన పాలకవర్గాన్ని అభినందించారు. యాదవ సమాజంలో ఉండే పేద విద్యార్థుల ఉన్నత చదువులకు సాయమందించడంలో పాలకవర్గం ముందుండాలని సూచించారు. నూతన అధ్యక్షుడు బైరీ రాములతో పాటు కార్యవర్గాన్ని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో యాదవ సంఘం సీనియర్ నాయకులు శ్రీహరి యాదవ్, ఐలయ్య యాదవ్, గంధం రాజు తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలో నూతనం గా ప్రతిష్ఠించిన శ్రీ మహంకాళి దేవాలయం పూజా కార్యక్రమంలో శుక్రవారం మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం గ్రామంలోని శ్రీ దుర్గా మాత ఆలయ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మూడు రోజులుగా జరుగుతున్న మహంకాళి జాతరలో రెడ్డి సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. కాగా నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29 నుండి వచ్చే నెల 1 వరకు జరిగే మహంకాళి దేవాలయ ఉత్సవాలకు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావును ఆహ్వానిస్తూ సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో గ్రామరెడ్డి సంఘం ప్రతినిధులు ఆహ్వానపత్రికను అందజేశారు.

కొత్త సహకారం ఏదీ?

(5వ పేజీ తరువాయి)

కనీసం జీతాలకు కూడా అంతగా ఆదాయం ఉండేది కాదు. దీంతో సహకార సం ఘాల భారం తగ్గేందుకు సొసైటీలను కుదించారు.

2012నుంచి ఆదాయం వైపు

సొసైటీలను బలోపేతం చేయడానికి 2012 నుంచి ఆదాయ వనరుల సమీరణవైపు అడుగులు పడ్డాయి. మొదట వడ్లకొనుగోలు కేంద్రాలను ఏర్పాటుకు నడుంబిగించారు. వడ్ల కొనుగోలు కేంద్రం ద్వారా క్వింటాల్‌కు రూ.30 చొప్పు న కమిషన్ ద్వారా సహకార సంఘాలు వనరు ల సమీకరణకు దోహదపడ్డాయి. వాణిజ్యపరమైన ఎరువులు, విత్తనాలను కూడా అందించడంతో పాటు పెట్రోల్ బంకులు, సూపర్ మార్కెట్లు, గోదాంలు, దుకాణసముదాయాల ఏర్పాటు వైపు దృష్టిసారించి, ఆదాయవనరుల సమీకరణకు దోహదపడ్డాయి.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు

చేర్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆర్ అండ్‌బీ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని శుక్రవారం చేర్యాల ప్రాంత కాంగ్రెస్ నేతలు హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈసందర్భంగా చేర్యాల మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, మద్దూరు మాజీ జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, నాయకులు ఖాజా తదితరులు మంత్రి కోమటిరెడ్డిని కలిసి స్థానిక పార్టీ పరిస్థితులపై చర్చించారు.



మంత్రితో మాజీ జడ్పీటీసీలు నర్సింగరావు, గిరికొండల్‌రెడ్డి

డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన వాహనతనిఖీల్లో డ్రంకెన్‌డ్రైవ్ చేస్తూ 13 మంది వ్యక్తులు పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట కోర్టులో హాజరుపరచగా విచారణ అనంతరం రూ.24వేలు జరిమానా విధించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



సిద్దిపేటలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ వాసుదేవరావు, ఏవో శ్రీనాథ్

సిద్దిపేట క్రైం/ములుగు, మే 23 (ఆంధ్రజ్యోతి): కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని సిద్దిపేట వన్ టౌన్ సీఐ వాసుదేవరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉన్న సీడ్స్ అండ్ ఫర్టిలైజర్‌షాప్ లో సిద్దిపేట అర్బన్ వ్యవసాయ అధికారి శ్రీనాథ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్, తదితర రికార్డులను తనిఖీ చేసి, షాప్‌లోన్ని సీడ్స్ ఫర్టిలైజర్ పరిశీలించారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు, కాలం చెల్లిన వాటిని అమ్ముతున్నట్లు సమాచారం వస్తే వెంటనే డయల్ 100, సంబంధిత పోలీస్ స్టేషన్ సమాచారం అందించాలని సూచించారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100కు సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా ములుగు మండలంలోని వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని విత్తన ఉత్పత్తి కంపెనీల్లో జిల్లా వ్యవసాయ అధికారి రాధిక, టాస్క్ ఫోర్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ, పోలీస్‌శాఖ సంయుక్తంగా అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ టీం విత్తనాలను, ఎక్స్‌పైరి తేదీలను, ఇతర రికార్డులను పరిశీలించారు.

రైతులపై ఎందుకింత వివక్ష?: దుబ్బాక ఎమ్మెల్యే



హబ్షీపూర్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, మే 23(ఆంధ్రజ్యోతి): రైతులపై కాంగ్రెస్ సర్కారుకు వివక్ష ఎందుకని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఓ వైపు అకాల వర్షాలతో అయోమయంలో ఉన్న రైతుల నుంచి 16 రోజులుగా ధాన్యం కొనుగోలు చేయకుండా అవస్థలపాలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం మొత్తం కల్లాలలోనే ఉందనీ, వర్షాలకు తడిసి మొలకలు వస్తున్నాయన్నారు. శుక్రవారం ఆయన దుబ్బాక మండలం హబ్షీపూర్, దుబ్బాక మున్సిపాలిటీ చేర్వాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. తడిసిన దాన్యంను చూసి సర్కారు తీరుపై మండిపడ్డారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు, నాలుగు రోజులైనా కూడా కొనుగోలు కేంద్రానికి లారీలను పంపించకుండా, ధాన్యంను గోదాంలకు తీసుకెళ్లకుండా నెలరోజులుగా రైతులను అవస్థపాలు చేస్తున్నారని మండిపడ్డారు. అంతేగాక ఈసీజన్‌లో ఇప్పటి వరకు జీలుగ విత్తనాలు సరఫరా చేయాల్సి ఉన్నా ప్రభుత్వానికి పట్టింపులేకుండా పోయిందన్నారు. ఆయన వెంట ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మెన్ బక్కివెంకటయ్య ఉన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌ల కుట్రతోనే కేసీఆర్‌కు నోటీసులు

● బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 23(ఆంధ్రజ్యోతి): బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి కుట్రతోనే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులకు నోటీసులు పంపించారని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. గజ్వేల్ పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాళేశ్వరంలో భాగంగా చేపట్టిన మేడిగడ్డపై కుట్రలు చేస్తూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలు ఒక్కటై నోటీసులు పంపాయని మండిపడ్డారు. కేసీఆర్, హరీశ్‌రావులకు నోటీసులు పంపించడం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగమేనని దుయ్యబట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రా నీటి దోపిడీని అరికట్టడానికే కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును రీడిజైన్ చేశారన్నారు. చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, మోదీ కుట్ర పన్ని కేసీఆర్, హరీశ్‌రావులపై నిందలు మోపే ప్రయత్నాలను చేస్తున్నారన్నారు.ఆయనవెంట నాయకులు మెట్టయ్య, దుర్గాప్రసాద్, అహ్మద్, మల్లేశం తదితరులున్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడు మృతి



లక్ష్మణ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న పూజల హరికృష్ణ, నాయకులు

చిన్నకోడూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలం చంద్లాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొమ్మగల్ల లక్ష్మణ్ (55)గుండెపోటుతో గురువారం రాత్రి మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ శుక్రవారం లక్ష్మణ్ మృత దేహానికి పార్టీ జెండా కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మీసం మహేందర్ యాదవ్, మహేందర్, సాంబమూర్తి, శ్రీనివాస్, ప్రవీణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకరంగా కేటీఆర్ మానసిక స్థితి

● గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్

గజ్వేల్, మే 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీలో ఆధిపత్యం కోసం చెలరేగిన అంతర్యుద్ధంతో కేటీఆర్ మానసికస్థితి ఆందోళనకరంగా మారిందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ ఆరోపించారు. గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కాళేశ్వరం బ్యారేజ్‌లను కాంగ్రెస్ నేతలు బాంబులు పెట్టి కూల్చారని కేటీఆర్ చేసిన ఆరోపణలపై మండిపడ్డారు. బీఆర్ఎస్‌లో చెలరేగిన అంతర్యుద్ధంతో ఆయన అభద్రతాభావానికి లోనవుతున్నారని, ఆయనను ఆసుపత్రిలో చేర్పించి చికిత్సను అందించాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గజ్వేల్ రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతే మన ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా. అఖిల పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కుకునూరుపల్లి పరిధిలోని రిమ్మనగూడ గ్రామంలో డ్రైడే- ఫ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అఖిల మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలందరూ ఇంటి పరిసరాల్లో మురికి నీటి గుంతలు లేకుండా చూసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రతీ మంగళవారం, శుక్రవారం డ్రైడే ఫ్రైడే పాటించి ఇంటిలో అపరిశుభ్రంగా ఉన్న పనికిరాని వస్తువులను బయటపడేసి, ఇంటిని శుభ్రపరచుకోవాలన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీహెచ్ఈవో ప్రేమ్ చందు, హెల్త్ అసిస్టెంట్ దేవసారి వాసుదేవ్, ఫీల్డ్ వర్కర్ ఎస్ రమేష్, విలేజ్ సెక్రెటరీ రామకృష్ణారెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది యాదగిరి, నర్సింలు, స్థానిక ఏఎన్ఎం మంజుల, ఆశావర్కర్‌లు తదితరులు ఉన్నారు.

వినూత్న పద్ధతిలో బోధించాలి

దుబ్బాక/కోహెడ, మే23(ఆంధ్రజ్యోతి): పాఠ్యాంశాలతోపాటు విద్యార్థులకు నూతన పద్ధతుల ద్వారా విద్యను అందించినప్పుడే, పోటీప్రపంచంలో తీర్చిదిద్దగలమని జిల్లావిద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం దుబ్బాక మున్సిపల్ లచ్చపేట మోడల్ స్కూల్‌తో పాటు కోహెడ మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నాలుగు రోజులుగా మండలస్థాయిలో ఉపాధ్యాయులకు కొనసాగుతున్న వృత్యంతర శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. నూతన బోధన పద్ధతులను అలవర్చుకోవాలని, మూసపద్ధతులను వదలాలని సూచించారు. మార్పులను ఎప్పటికప్పుడు అంది పుచ్చుకుంటూ, విద్యాబోధనలో నూతనత్వాన్ని ఆవిష్కరించాలన్నారు. విద్యార్థులను అన్ని రంగాలలో నిష్ణాతులను చేసి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసే విధంగా బోధన ఉండాలని కోరారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలకు, ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో మెదక్ ఉపాధ్యాయ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ గంగయ్య, ఎంఈవోలు ప్రభుదాస్, ఆర్ పద్మయ్య, సెక్టోరియల్ అధికారి బేతి భాస్కర్, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు



కోహెడలో జడ్పీ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి



మర్కుక్‌జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణనిస్తున్న ఆంగ్ల భాష నిపుణుడు సిద్దు

వివిధ మండలాల్లో వృత్యంతర శిక్షణ

వర్గల్/దౌల్తాబాద్/కుకునూరుపల్లి/జగదేవ్‌పూర్/మర్కుక్ మే 23 (ఆంధ్రజ్యోతి): వర్గల్ ఎంఈవో కార్యాలయంలో జరిగిన వృత్యంతర శిక్షణ కార్యక్రమానికి మెదక్ జిల్లా డైట్ రిటైర్డ్ ప్రిన్సిపాల్, ప్రముఖ మనోవిజ్ఞాన శాస్త్ర ఉపన్యాసకుడు రమేశ్ బాబు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వారి వృత్తిలోనే ఆనందాన్ని వెతుక్కోవాలని, కొద్ది పాటి తేడా అనేది ఎన్నో మార్పులకు దారి తీస్తుందన్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ సమావేశానికి జిల్లా ఇంగ్లిష్ రిసోర్స్ పర్సన్ మంజుల హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెపొందించాలని ఉపాధ్యాయులను కోరారు. కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయుల శిక్షణ జిల్లా పరిశీలకులు పీవీ సత్యకుమార్, బాలాభాస్కర్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. పిల్లల్లో పోటీతత్వం పెంపొందేలా కార్యక్రమాలు ఉండాలన్నారు. జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమానికి ప్రధాన వక్తగా రాష్ట్ర రిసోర్స్ పర్సన్ తాడెం ఓంకార్ రాధాకృష్ణ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు నిరంతరం నేర్చుకునే ప్రయత్నం చేయాలని, దీంతో మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. మర్కుక్ మండలకేంద్రంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పరిసరాల విజ్ఞానంపై ఉపాధ్యాయులకు శిక్షణ కొనసాగింది. ప్రయోగాలు, సందర్శనల ద్వారా విద్యార్థులు చాలా విజ్ఞానం పొందుతారని ఎంఈవో శ్రీ వెంకటరాములు పేర్కొన్నారు. సైన్స్ రిసోర్స్ పర్సన్స్ భూపతిరెడ్డి, మల్లేశం పరిసరాల విజ్ఞాన బోధనా పద్ధతులపై పూర్తి స్థాయిలో వివరించారు. అదే విధంగా ఆంగ్లంలో కమ్యూనికేషన్ స్కిల్‌పై లయన్ సిద్దుచే ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. శిక్షణ కార్యక్రమాల్లో ఆయా మండలాల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అక్షర వేషధారణ

సిద్దిపేట కల్చరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కొనసాగుతుండగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జడ్పీ హైస్కూల్‌లో తెలుగు రిసోర్స్ పర్సన్ సయ్యద్ సంధాని వినూత్న అక్షర వేషధారణతో అకట్టుకున్నారు. అక్షరమాలను వివిధ రంగుల అక్షరాలతో రాసి పూలమాలల వలే అక్షర మాలను ధరించి శిక్షకులను ఆలోచింపజేశారు. కాగా శిక్షణ కార్యక్రమం మండల విద్యాధికారి, కోర్సు డైరెక్టర్ రాజప్రభాకర్ రెడ్డి నేతృత్వంలో ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానంపై కొనసాగింది. శిక్షణ తరగతుల్లో ఆర్పీలు కనకరాజు, ప్రశాంత్, రాకేష్, దేవరాజ్, పసియొద్దిన్, వినోద్, జంపయ్య, శ్రీనివాస్, సరిత తదితరులు పాల్గొన్నారు.



అక్షరమాలతో సయ్యద్ సంధాని